# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లో మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికను రూపొందించినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

**2. తెలంగాణ హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ రోజు శంకుస్థాపన చేస్తారు.**

**3. కృత్రిమ మేధ నైపుణ్యాలను యువత అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

**4. ఆంధ్రప్రదేశ్ లో 23 లక్షల మెట్రిక్ టన్నుల రబీ పంట ధాన్యం కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**5. ప్రపంచవ్యాప్తంగా ఈస్టర్ పండుగను ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

'జనాభా స్థిరీకరణ' విధానంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికను రూపొందించినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మాతా-శిశు ఆరోగ్య సంరక్షణ, పితృ భాగస్వామ్యం, పనిచోట్ల చిన్నారుల సంరక్షణ కేంద్రాలు-క్రెష్‌లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మహిళల శ్రామిక భాగస్వామ్యాన్ని 31 శాతం నుంచి 61 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. చిన్న వయసులో గర్భధారణ, సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై దృష్టి సారించనున్నామని తెలిపారు. మహిళలకు అనుకూలమైన పనివేళలు, ఇంటి నుంచి పని చేసే అవకాశాలను కూడా కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

-------------------------

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నిర్మించనున్న తెలంగాణ హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ రోజు శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఇతర అధికారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిన్న శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం

సీజేఐ గౌరవార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర న్యాయమూర్తులు, అధికారులు హాజరయ్యారు.

---------------------------

కృత్రిమ మేధ –ఏఐ నైపుణ్యాలను యువత అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా --STPI రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. కృత్రిమ మేధలో వస్తున్న మార్పులు, భవిష్యత్ తరాలకు అందించాల్సిన శిక్షణపై ఈ కార్యశాలను నిర్వహించారు. ప్రపంచం ఏఐ రంగం వైపు వేగంగా మారుతోందని దీనికి అనుగుణంగా మానవ వనరులకు తగిన శిక్షణ ఇవ్వడం అవసరమని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 28 సెకన్లు.

---------------------------

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్ విశాఖపట్నం జిల్లాలో ఈరోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా ఆసియా అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంధాన కేంద్రం -ACIAM, ఆధ్వర్యంలో జరగనున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు MSME కాన్ఫరెన్స్–2026లో ఆయన పాల్గొంటారు. ఈ సదస్సులో MSME ల అభివృద్ధికి చట్టపరమైన అవగాహన, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాల ద్వారా MSME వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి నిన్న విశాఖపట్నం విమానాశ్రయం చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో 23 లక్షల మెట్రిక్ టన్నుల రబీ పంట ధాన్యం కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, 'రాష్ట్ర వ్యాప్తంగా 1,917 కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని ధాన్యం అమ్మిన తరువాత 24 గంటల్లో రైతులకు నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ కు ఎటువంటి కొరతా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 31 సెకెన్లు

---------------------------

ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఈరోజు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఏసుక్రీస్తు పునరుత్థాన జ్ఞాపకార్థం జరుపుకునే పండుగ ఈస్టర్. మరణంపై జీసస్ సాధించిన విజయానికి, కొత్త జీవితానికి ప్రతీకగా క్రైస్తవులు విశ్వసిస్తారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఈస్టర్ గుడ్లను బహుమతిగా ఇచ్చుకోవడం వంటివి నిర్వహిస్తారు.

---------------------------

కర్ణాటకలోని సింధనూర్ హోసల్లిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక పాఠశాలను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో నారా లోకేష్ ప్రసంగిస్తూ, కర్ణాటక సంస్కృతి, సంప్రదాయం గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు మార్కులు తక్కువగా వచ్చాయని అధైర్యపడకూడదని కష్టపడాలి.

అనుకున్నది సాధించాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా 890 కోట్ల రూపాయలతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక–ణూ=లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో నిర్మాణంలో ఉన్న రహదారులు, కల్వర్టుల పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక మౌలిక వసతులు పెంపొందించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపటి నుంచి 11వ తేదీ వరకూ ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. హెల్త్ వీక్‌లో రోజువారీగా నిర్వహించనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుంచి దృశ్యశ్రవణ మాధ్యమం విధానంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా, ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా చేపట్టే అన్ని కార్యక్రమాల్లోనూ విద్యార్థులు, మహిళలు, యువతను భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రేపటి నుంచి మూడు రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఈ రోజు రాష్ట్రంలోని పలు జిల్లాలలో తీవ్ర వడగాలుల ప్రభావం ఉంటుందని తెలిపింది

తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇకపై 5 కిలోల ద్రవీకృత పెట్రోలియం వాయువు –ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ను నివాస ధృవీకరణ పత్రం -- అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల దగ్గర ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపింది. అదేవిధంగా దేశంలో పెట్రోల్, డీజిల్ కి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళనతో ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా తగినన్ని ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

=====================